ఇంకెన్నాళ్లు ?

"ఇళ్లు లేని నిరుపేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సెంటున్నర స్థలం ఇస్తే అది మనిషి దహన సంస్కారాలకు కూడా సరిపోదు.. మేము అధికారంలోకి వస్తే పేదలకు మూడు సెంట్ల భూమి కేటాయిస్తాం.. సొంతింటి నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేస్తాం ..'' ఇదీ గత ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు చేసిన వాగ్దానం. తీరా గద్దెనెక్కాక పేదల ఇంటి సంగతే మర్చిపోయారు. ఏడాదిగా పేదలకు ఎదురుచూపులే మిగిలాయి. మరోవైపు గత ప్రభుత్వంలో ఏర్పాటైన జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూటమి సర్కారు తీవ్ర అలసత్వం వహిస్తూ పేదలను మోసగిస్తోంది.

- జగనన్న కాలనీల్లో వసతుల లేమితో ఇబ్బంది పడుతున్న పేదలు
- మౌలిక సదుపాయాల కల్పనలో కూటమి సర్కారు నిర్లక్ష్యం
- కొత్త గృహాలు మంజూరు కోసం పేదల ఎదురుచూపులు
- చంద్రబాబు బూటకపు హామీలపై ప్రజల మండిపాటు



డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో చిత్తూరు నియోజకవర్గం గుడిపాలలోని కాలనీలో రోడ్డుపై మురుగునీరు

చిత్తూరు కలెక్టరేట్: గత వైఎస్సార్‌సీపీ సర్కారు పాలనలో సొంతిల్లు లేదని ఎవరూ బాధపడకూడదనే లక్ష్యంతో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి ఇళ్ల స్థలాలను మంజూరు చేసింది. కొన్నిచోట్ల గ్రామాల్లో ప్రభుత్వ స్థలం లేకుంటే ప్రైవేట్ స్థలం సేకరించి సెంటున్నర స్థలం చొప్పున పట్టాలను మహిళల పేరుతో రాజకీయాలకు అతీతంగా ఉచితంగా అందజేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా ఇంతవరకు ఎటువంటి ఇళ్లు మంజూరు చేయకుండా పేదోడి సొంతింటి కలను దూరం చేస్తోంది.

జగనన్న కాలనీల్లో వసతుల లేమి

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లోని ప్రతి మండలంలో గత ప్రభుత్వ పాలనలో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. ఆ కాలనీల్లో వివిధ దశల్లో ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఊళ్లకు ఊళ్లు తయారవుతున్నా వాటిలో మౌలిక వసతుల కల్పనపై కూటమి సర్కారు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది. పల్లెపండుగ పేరుతో హడావుడి చేసి.. ఈ కొత్త కాలనీల వైపు కన్నెత్తి చూడకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లు, డ్రైనేజీలు కావాలని విన్నవిస్తున్నారు. మంజూరైన ఇళ్లకు బిల్లుల చెల్లింపులో ఆలస్యం, చేస్తుండడంతో లబ్ధిదారులు గృహాలను పూర్తి చేయలేక ఇబ్బంది పడుతున్నారు. 2023 ఏడాది చివర్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాదాపు 1,528 ఇళ్లను మంజూరు చేసింది. అయితే ఈ ప్రభుత్వం ఆ ఇళ్లను రద్దు చేసి తిరిగి మళ్లీ డిమాండ్ సర్వే పేరిట సర్వే చేపడుతోంది. గతేడాది నవంబర్, డిసెంబర్‌లో టీడీపీ నాయకులు కొత్త ఇళ్లు మంజూరు చేస్తున్నామని హడావుడి చేయగా, అందరూ దరఖాస్తులు పట్టుకుని నాయకులు, అధికారుల చుట్టూ తిరిగారు. అవి ఇప్పటికీ మంజూరు కాకపోవడంతో క్షేత్రస్థాయిలో ప్రజలు కూటమి పాలనపై దుమ్మెత్తి పోస్తున్నారు.

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పక్కా గృహాల సమాచారం

నియోజకవర్గం	మంజూరైన గృహాలు	పూర్తయిన గృహాలు	ఖర్చు చేసిన మొత్తం రూ.కోట్లల్లో
చిత్తూరు	10,926	5,928	రూ.202.96
పూతలపట్టు	10,541	7,670	రూ.189.74
మొత్తం	21,467	13,598	రూ.392.70



ఐరాల మండలం వైఎస్ గేట్ లేఅవుట్‌లో అసంపూర్తిగా ఉన్న గృహాలు

సదుపాయాలెక్కడ....?



ఇటీవలే ఇంటి నిర్మాణం పూర్తి చేయడం జరిగింది. కాలనీలో విద్యుత్ తప్ప ఏ ఇతర మౌళిక సదుపాయాలు లేవు. మురుగునీరు పోయేందుకు డ్రైనేజీ సౌకర్యం అస్సలు లేదు. దీంతో మురుగునీరు కాలనీలో రోడ్డుపైనే పోతోంది. రాకపోకలకు రోడ్లు కూడా సరిగా లేవు. చుట్టుపక్కల పొలాల నుంచి వచ్చే నీరు కాలనీ మధ్యలోనే నిలిచిపోతోంది. కాలనీల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యతనివ్వాలి.

-కృష్ణవేణి, లబ్ధిదారురాలు, తవణంపల్లి

సదుపాయాలు పెంచాలి



కాలనీల్లో సదుపాయాలను పెంచాలి. మా కాలనీల్లో గృహ ప్రవేశాలు చేసుకుని నివాసం ఉంటున్నాం. సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కుంటున్నాం. రాత్రి సమయాల్లో రాకపోకలు చేయాలంటే భయమేస్తోంది. అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తే మహిళలకు, కుటుంబాలకు అనుకూలంగా ఉంటుందని ఆశిస్తున్నాం. రోడ్లు, తాగునీటి సౌకర్యం కొరతగా ఉంది. ప్రభుత్వం, అధికారులు స్పందించాలి.

-జ్యోతీశ్వర్, లబ్ధిదారుడు, యాదమరి

సౌకర్యాలు కల్పించాలి



గత సర్కారు పుణ్యమా అని ఉచిత ఇంటిపట్టాతో పాటు సొంతంగా ఇల్లు కట్టుకోవడం జరిగింది. ప్రస్తుతం మా కాలనీలో మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. ఈ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. డ్రైనేజీలు వేస్తే మాత్రం మరిన్ని కుటుంబాలు మా కాలనీలో నివాసం ఉంటాయి. ప్రతి ఒక్కరూ ఇల్లు కట్టుకుని పాలు పొంగించి మూడు రోజుల పాటు ఉండి వెళ్లిపోతున్నారు. ఇంట్లో ఉండేందుకు చాలా మంది సాహసం చేయడం లేదు.

-సుజాత, ఐరాల

హామీ నిలబెట్టుకోవాలి...



గత ప్రభుత్వం స్థలాలు లేని చోట్ల ప్రైవేట్ స్థలం కొని మరీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. ఈ ప్రభుత్వమేమో అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. ఇంత వరకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోనేలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త లబ్ధిదారుల విషయం పక్కన పెడితే ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్ల నిర్మాణం సైతం పూర్తి చేయడం లేదు.

-రోజా, లబ్ధిదారురాలు, ఐరాల

చాలా వరకు అసంపూర్తిగా..



జగనన్న కాలనీల్లో చాలా వరకు కుటుంబాలు అసంపూర్తిగా ఉంటున్నాయి. గత ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ ఇళ్లు ఉండాలన్న లక్ష్యంతో ముందుకు సాగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇళ్ల నిర్మాణాలను నిర్లక్ష్యం చేస్తూ నిలిపివేస్తోంది. ఇలా చేయడం అన్యాయం. పేదలకు మేలు చేయాలే తప్ప కీడు చేయకూడదు.

-హేమలత, చిత్తూరు

క్లుప్తంగా

నేడు ప్రశాంత్ నగర్‌లో గంగజాతర

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని ప్రశాంత్ నగర్‌లో మంగళవారం గంగజాతర నిర్వహిస్తున్నట్లు జాతర పెద్దలు తెలిపారు. ఉదయం 6 గంటలకు తొలిపూజ జరుగుతుందన్నారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు, అంబిలి పోయుట ఉంటుందన్నారు. రాత్రికి కుంభ నైవేద్య సమర్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుందని తెలిపారు.

నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బంగారుపాళెం: విద్యార్థులు సృజనాత్మక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు జవహర్‌బాషా అన్నారు. సోమవారం బంగారుపాళెం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు వృక్షోరక్షతి రక్షితః పై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. 12 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే కొత్త ఆలోచనలతో భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ నెల 6న శిక్షణ శిబిరం ముగింపు రోజు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

రేపు డీసీసీబీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

చిత్తూరు రూరల్(కాణిపాకం): డీసీసీబీ చైర్మన్‌గా అమాస రాజశేఖర్ రెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు జెడ్పీ సీఈఓ శంకర్ బాబు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. కార్యాలయ, బ్యాంకు అధికారులు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

కార్పొరేషన్‌లో పీజీఆర్ఎస్ వినతులు



వినతులు తీసుకుంటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, వినతులను విచారించి వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరు వెంకట్రామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీచైతన్య ప్రతిభ



లోహిత్, పూజిత

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని గాంధీరోడ్డులో ఉన్న శ్రీ చైతన్య కళాశాలలో చదువుతున్న విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ చాటారని ఆ కళాశాల ఏజీఎం ప్రసాద్, ప్రిన్సిపల్ శివకుమార్ వెల్లడించారు. ఈ మేరకు వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. తమ కళాశాలలో చదువుతున్న ఎస్.లోహిత్ 4160, పూజిత 5343 ఆల్ ఇండియా ర్యాంకులను సాధించినట్లు తెలిపారు. అనంతరం ఆ విద్యార్థులను అభినందించారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రక్షిత

గుడిపాల: ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం జాగ్రత్తలు పాటించాలని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రక్షిత అన్నారు. సోమవారం తిమ్మయ్యపల్లెలో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి అధికంగా ఉండడం వల్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం షుగర్, బీపీ, మోకాళ్లనొప్పులు, గర్భిణులు, బాలింతలకు చికిత్సలు నిర్వహించి వారికి కావలసిన మందులను ఉచితంగా అందజేశారు. ఇంటి వద్ద మంచానికే పరిమితమైన వారి ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులకు ప్రతివారం ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి



గర్భిణులకు సూచలిస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: పేదలకు ఇంటింటికి ఉచిత వైద్య సేవలందిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. సోమవారం మండలంలోని మల్లకుంటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి లార్వా దశలోనే దోమలు అంతమొందించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలి..

గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మండలంలోని పుణ్యసముద్రంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు బీపీ పరీక్షలు చేయించి ఆరోగ్య సూత్రాలు వివరించారు. గర్భిణులు తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టాలన్నారు. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై ఇంద్రవరదుడు



హనుమంత వాహనంపై ఊరేగుతున్న వరదరాజ స్వామి

యాదమరి: మండల కేంద్రం యాదమరిలో కొలువుదీరిన శ్రీ వరదరాజస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అశేష భక్త జనవాహిని మధ్య వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామివారికి ఇష్టభక్తుడైన హనుమంత వాహనంపై శ్రీరాముడి అవతారంలో మాడవీధుల్లో విహరించారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో స్వామివారికి కర్పూర హారతులు పట్టారు. ఈ వాహనంపై ఉన్న స్వామివారిని దర్శిస్తే బుద్ధి, బలం, ధైర్యం, యశస్సు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అంతకు ముందు మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం రాత్రి గజవాహనంపై ఊరేగుతూ వరదరాజస్వామివారు భక్తులను కటాక్షించారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరిగే రథోత్సవానికి వేలసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున నిర్వాహకులు పోలీసు వారి సహకారంతో పటిష్ట ఏర్పాట్లు పూర్తిచేశారు.

విజ్ఞానం పెంపునకు వేసవి శిబిరం



వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న గ్రంథాలయాధికారి సుజాత

ఐరాల: గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. స్థానిక గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, గణితం, నీతి కథలు చదివించడం తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి సుజాత మాట్లాడుతూ విద్యార్థులకు స్వర్ణాంధ్ర-స్వర్ణాంధ్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. విజేతలకు శిక్షణ శిబిరాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని చెప్పారు. విద్యార్థులకు అన్ని రంగాలకు సంబంధించిన అంశాలపై విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

క్షయవ్యాధి, హెచ్ఐవీపై అవగాహన



వారపుసంతలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృంద సభ్యులు

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లె వారపు సంతలో సోమవారం కళాజాత ద్వారా హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో వారపుసంతలో కళాజాత సభ్యులు క్షయవ్యాధి, హెచ్ఐవీ ఎలా వస్తాయి? వస్తే ఏమి చేయాలనే విషయాలపై పాటల ద్వారా వినిపించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవీపై అవగాహనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రెడ్డెమ్మ, ఎల్‌టి శేఖర్, కేర్ ఎన్‌జీఓ సద్దాం, కళాకారులు పాల్గొన్నారు.

5న సర్వసభ్య సమావేశం

యాదమరి: మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 5వ తేదీన జరగనుందని ఎంపీడీఓ వేణు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, కోఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు ప్రతిఒక్కరూ గురువారం ఉదయం 11 గంటలకు సమావేశ మందిరానికి చేరుకోవాలని కోరారు.

పంపిణీకి సిద్ధంగా వేరుశనగ



నలిశెట్టిపల్లె రైతు సేవా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న విత్తనకాయలు

తవణంపల్లె: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ తెలిపారు. మండలంలోని రైతు సేవా కేంద్రాలకు 1,110 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు కే6 రకం వచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే రైతులకు ఆయా రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. అదే విధంగా జీలుగ 17 క్వింటాళ్లు, జనుము 60 క్వింటాళ్లు వచ్చినట్లు వివరించారు. విత్తనకాయలను ఆయా ఆర్ఎస్‌కేల్లో నిల్వ ఉంచినట్లు చెప్పారు.

షుగర్ అదుపులో లేకపోతే నష్టం



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: షుగర్ వ్యాధిని నియంత్రణలో పెట్టుకోకపోతే శరీరంలో పలు అవయవాలు పాడైపోతాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని 35 యర్లంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. షుగర్ వ్యాధి చికిత్సలో ఆహార నియమాలు, వ్యాయామం కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. బీపీ, షుగర్, కొలెస్ట్రాల్‌ను అదుపులో పెట్టుకుని, వైద్యుల సూచనలతో మందులు వాడడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. మాత్రలు వాడుతున్నప్పటికీ వ్యాధి అదుపులోకి రాకపోతే ఇన్సులిన్ వాడాలని, అశ్రద్ధ చేయడం వల్ల అనేక నష్టాలు సంభవిస్తాయని వెల్లడించారు. డాక్టర్ సలహా మేరకు అవసరమైతే ఇన్సులిన్ వాడాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని నిరసన



చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వమే రూ.5 లక్షల రుణం మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి గోపీనాథ్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు చిత్తూరు నగరంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో వేలాదిమంది తలదాచుకోవడానికి గూడు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ముస్లిం మైనారిటీలు బాడుగ ఇళ్లలో నివసిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షలు ప్రభుత్వమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఇళ్ల స్థలాల మంజూరు చేయాలని పెద్దదళితవాడ, లెనిన్ నగర్, మంగసముద్రం హౌసింగ్ కాలనీ, చామంతిపురం, గూలింగ్స్ పేట్, మసీదుమిట్ట ప్రాంతాల్లో నివసించు నిరుపేదలు అర్జీలు పెట్టుకున్నారని, వాటిని ఆయా గ్రామ వార్డు సచివాలయాలకు పరిశీలన కోసం పంపుతామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

దోమల నియంత్రణతో మలేరియా దూరం



మలేరియాపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గుడిపాల: మలేరియా నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. సోమవారం వసంతాపురంలో మలేరియా నివారణపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్య మాట్లాడుతూ దోమల నిర్మూలనతో మలేరియా నివారించవచ్చని వాటిపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉంటే మనందరిలో మార్పుతో సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. తద్వారా దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి సారించాలని మారుమూల, గిరిజన ప్రాంతాల్లో జ్వర లక్షణాలు సత్వరమే గుర్తించి సిబ్బంది పరీక్షలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది విజయ, సరస్వతి, చంద్రశేఖర్, సుజమ పాల్గొన్నారు.

ప్రజలను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం

- రేపు అన్ని నియోజకవర్గాల్లో వెన్నుపోటు దినం
- పోస్టర్లను ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ చిత్తూరు పార్లమెంట్ పరిశీలకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి



వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చవ్వా రాజశేఖర్‌రెడ్డి, విజయానందరెడ్డి నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు బుధవారం 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆ పార్టీ చిత్తూరు పార్లమెంట్ పరిశీలకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్తతో విజయానందరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నగరంలోని ప్రజాప్రతినిధులు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో అనంతరం వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2025 జూన్ 4 నాటికి ఏడాది పూర్తవుతుందన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలతో పాటు 143 ఇతర హామీలు ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ అన్ని లెక్కలు చూసుకున్నామని.. సంపద సృష్టించి ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తామని చెప్పారన్నారు. పైగా హామీలు అమలు చేయకపోతే చొక్కా పట్టి నిలదీయాలని చెప్పారని గుర్తు చేశారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలను వీరు నట్టేట ముంచారన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ మోసాలపై జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజల భాగస్వామ్యంతో నిరసన ర్యాలీలు చేపట్టి, అధికారులకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బాబుకు వెన్నుపోటు కొత్తకాదు..

చంద్రబాబుకు అబద్ధాలతో ప్రజలను మోసం చేయడం, వెన్నుపోటు పొడవడం కొత్తకాదని మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గాయత్రీదేవి, లీనారెడ్డి, మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిణిరెడ్డి, పెన్షనర్ల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసింది శూన్యమన్నారు. రాష్ట్రం సంక్షోభంలో ఉన్న విషయం 15 ఏళ్లుగా సీఎంగా పనిచేసిన చంద్రబాబుకు తెలియదా ? అని నిలదీశారు. సంపద సృష్టించి సూపర్‌సిక్స్ అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. కేవలం పెన్షన్ రూ.4 వేలు ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ సరళమేరీ, నాయకులు నవాజ్, నారాయణ, అప్పాజీ ఆరోపించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు దినేష్‌రెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి, బాబునాయుడు, మధురెడ్డి, అను, నౌషద్, భాగ్యలక్ష్మి, భారతి, ఆర్ముగం, శివ, మనోహర్, శిరీష్‌రెడ్డి, హేమారెడ్డి, లక్ష్మణస్వామి, అన్బు, దేవరాజు, చల్లాముత్తు, ఉన్ని, అల్తాఫ్, శివారెడ్డి, రమణ, మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ప్రాముఖ్యతను తెలుసుకోండి

పూతలపట్టు(కాణిపాకం): భూసార పరీక్షల ప్రాముఖ్యతను తెలుసుకుని రైతులు వాటి ఆధా రంగా ఎరువులు వాడాలని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి ప్రసన్నలక్ష్మి తెలియజేశారు. పూతలపట్టు మండలం పి. కొత్తకోట గ్రామంలో సోమవారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌పై అహగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన విశ్వవిద్యాలయం అధ్యాపకులు రాజానాయక్ మాట్లాడుతూ మామిడిలో తెగుళ్ల నివారణ, కొబ్బరి, పూల తోటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వివరించారు.